తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

బుధవారం

14 అక్టోబర్ 2026



# కల్తీ లేని బంధాలకు కాలం చెల్లిందా?

- సెల్‌ఫోన్ మాయలో కనుమరుగవుతున్న ఆత్మీయతలు
- మనసుకు చార్జింగ్ ఇచ్చేది ప్రేమ.. అనురాగమే!
- కల్తీ లేని బంధాలు కనుమరుగు.. సెల్‌ఫోన్ మాయలో మానవ సంబంధాలు!
- మనుషుల మధ్య తగ్గుతున్న ఆత్మీయతలు.. మసకబారుతున్న అనురాగాలు
- ప్రతి వస్తువుకూ చార్జింగ్ అవసరమే.. మరి మానవ మనసుకు చార్జింగ్ ఎక్కడ?

**కోహీర్, అక్టోబర్ 13, (జనంసాక్షి):** ఒకప్పుడు మనుషుల మధ్య అనుబంధాలు ఎంతో ఆత్మీయంగా ఉండేవి. పలకరింపుల్లో ప్రేమ, మాటల్లో మమకారం, కలుసుకోవడంలో ఆనందం కనిపించేవి. పండుగలు, శుభకార్యాలు, కుటుంబ వేడుకలు వచ్చినప్పుడు బంధువులు, స్నేహితులు ఒకచోట చేరి సంతోషాలను పంచుకునేవారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తూ మానవత్వానికి నిజమైన అర్థం చెప్పేవారు. కానీ నేటి ఆధునిక జీవనశైలిలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోవడంతో ఆ కల్మషం లేని బంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది.

**ప్రతి వ్యక్తి చేతిలో సెల్‌ఫోన్..** ప్రతి ఇంట్లో ఇంటర్నెట్.. ప్రతి క్షణం సామాజిక మాధ్యమాల్లో గడిచిపోతున్న సమయం. పక్కనే మనిషి ఉన్నా పలకరించడానికి సమయం లేని పరిస్థితి నెలకొంటోంది. కుటుంబ సభ్యులు ఒకేచోట కూర్చున్నప్పటికీ ఎవరి చేతిలో వారి ఫోన్ ఉండటం, పరస్పరం మాట్లాడుకోవడం తగ్గిపోవడం నేటి సమాజంలో సాధారణంగా మారింది. దూరంగా ఉన్నవారితో సాంకేతికత ద్వారా మాట్లాడగలుగుతున్నా.. దగ్గరగా ఉన్నవారితో మనసు విప్పి మాట్లాడుకునే సమయం మాత్రం తగ్గిపోతోంది.

మిగతా 9లో..

# నవాబుపేట జెడ్పీహెచ్‌ఎస్‌కు రూ.11.85 కోట్లు

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, అక్టోబర్ 13 (జనంసాక్షి):** జడ్చర్ల నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 20 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల అభివృద్ధికి రూ.205.95 కోట్లు మంజూరు చేస్తూ విద్యాశాఖ జీవో 188 జారీ చేసింది. ఇందులో భాగంగా నవాబుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు (జెడ్పీహెచ్ఎస్) రూ.11.85 కోట్లు కేటాయించారు. మంగళవారం నిధుల మంజూరుపై జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ నిధులతో పాఠశాల రూపురేఖలు మారి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 13 (జనంసాక్షి):** దేశ అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు. అమరవీరుల సేవలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా వివిధ సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు బాధ్యతలు..

- కల్వకుర్తి సమన్వయకర్తగా ఎమ్మెల్యేకసిరెడ్డి
- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలకుల నియామకం
- ఓటరు నమోదు ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని ఆదేశాలు






**కల్వకుర్తి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** రానున్న తెలంగాణ శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకులను నియమించింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో ఈ నియామకాలు చేపట్టినట్లు కమిటీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని 83-కల్వకుర్తి శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. నియమితులైన పరిశీలకులు, సమన్వయకర్తలు సంబంధిత జిల్లాల నాయకులతో సమన్వయం చేసుకుంటూ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కమిటీ

మిగతా 7లో..

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## వనపర్తి శాసనసభ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ




**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించింది. ఇందులో భాగంగా వనపర్తి శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్తగా స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని నియమించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ అక్టోబర్ 13న ఉత్తర్వులు జారీ చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు

మిగతా 5లో..

# రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



**మల్దకల్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారంఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులను పొందారు. శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి దేవరగట్టు వరకు రోడ్ల నిర్మాణానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేని వేద పండితులు శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూత్వరలో జరగబోయే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు దేవర గట్టుకు వెళ్లి స్వామిని దర్శించుకుని రావడానికి వీలుగా రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంతేగాక దాసంగాలు సమర్పించడానికి కూడా ఎంతో వేలుగా ఉంటుందని తెలిపారు.

**ఆలయ చైర్మన్ మాట్లాడుతూ..** ఎమ్మెల్యే సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, ఆలయ వ్యవస్థాపక వంశీయులు చైర్మన్ ప్రహల్లాదరావు, జిల్లా సీనియర్ నాయకులు సత్యరెడ్డి, సీతారాం రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ రామన్ గౌడ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, నాయకులు వెంకటన్న,

మిగతా 6లో..

# నిబంధనలు ఉల్లంఘించిన 5 ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు సీజ్

- జిల్లా వైద్యాధికారి డా.శ్రీనివాసులు చర్యలు!
- బాలానగర్ మండలం హేమాజీపూర్ కేంద్రంపై వేటు!






**బాలానగర్, అక్టోబర్ 13(జనంసాక్షి):** నిబంధనలకు విరుద్ధంగా, అర్హతకు మించి వైద్యం చేస్తున్న ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలపై జిల్లా వైద్యారోగ్య శాఖ కొరడా ఝుళిపించింది. ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన కేంద్రాలు యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్స్, నెబులైజర్ వాడకం వంటివి చేస్తున్నట్లు గుర్తించి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఏ.శ్రీనివాసులు మంగళవారం జిల్లాలో 5 కేంద్రాలను మూసివేయించారు.

నియోజకవర్గ పరిధిలోని మిడ్జిల్ మండలంలో ఒకటి, అదే మండలంలోని బోయినపల్లిలో ఒకటి, కొత్తపల్లి మండలంలో ఒకటి, బాలానగర్ మండలం లిహేమాజీపూర్ లో ఒకటిలి, నవాబ్ పేట



మండలం కాకర్లపహాడ్ లో ఒకటి చొప్పున మొత్తం 5 కేంద్రాలను అధికారులు సీజ్ చేశారు.

ముఖ్యంగా బాలానగర్ మండలం హేమాజీపూర్ లోని ఫస్ట్ ఎయిడ్ కేంద్రంలో పరిధికి మించి చికిత్సలు అందిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి చర్యలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, పరిధి దాటి ఎలాంటి చికిత్సలు చేయకూడదని డీఎంహెచ్ వో స్పష్టంగా ఆదేశించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో డీఎల్ఓ డా.రాజు, నోడల్ ఆఫీసర్ డా.శివకాంత్, జిల్లా మాస్ మీడియా అధికారి జి.నర్సింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

• జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 13 (జనం సాక్షి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. అక్టోబర్ 21న జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 31న సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా పోలీసుల విధులు, త్యాగాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలపై అవగాహన కల్పించేందుకు ఓపెన్‌హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రక్తదాన శిబిరాలు, ర్యాలీలు, కొవ్వొత్తుల ర్యాలీలు, అమరవీరుల కుటుంబాలకు పరామర్శ కార్యక్రమాలు చేపట్టనున్నారు. పోలీస్ కళాబృందం ద్వారా బహిరంగ ప్రదేశాల్లో అమరవీరుల త్యాగాలను వివరించే పాటల కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విద్యార్థులు, పోలీస్ అధికారులకు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు సైబర్ నేరాల నివారణలో పోలీసుల, పౌరుల పాత్ర, డ్రగ్స్ నివారణ వంటి అంశాలపై పోటీలు ఉంటాయి. డిగ్రీ, ఆపై చదువుతున్న విద్యార్థులకు సోషల్ మీడియా దుర్వినియోగం నివారణ, తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో తమ పాత్ర వంటి అంశాలను కేటాయించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి అధికారులకు ప్రజాస్వామ్యంలో ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు, సోషల్ మీడియా వినియోగంపై, ఎస్‌ఐ, ఆపై స్థాయి అధికారులకు పోలీసులపై ప్రజల విశ్వాసం, పోలీస్ వ్యవస్థ బలోపేతం వంటి అంశాలపై పోటీలు నిర్వహిస్తారు. అలాగే మూడు నిమిషాలకు మించకుండా షార్ట్ వీడియోలు రూపొందించవచ్చని తెలిపారు. ఫోటోలు, వీడియోలను ఈ నెల 23వ తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీఆర్‌ఓకు అందజేయాలని సూచించారు. ఉత్తమ రచనలు, ఫోటోలు, వీడియోలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతాయని పేర్కొన్నారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణ త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని ఎస్పీ కోరారు.

### షణ్ముఖ అగ్రిటెక్

## వైస్ చైర్మన్‌కు ఘన సన్మానం



కోహీర్, అక్టోబర్ 13 (జనం సాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ ఎక్స్‌రోడ్ లోని శ్రీ సాయి గణేష్ ఫర్టిలైజర్ షాప్‌లో షణ్ముఖ అగ్రిటెక్ లిమిటెడ్ వైస్ చైర్మన్ దాసరి బాబురావును డీలర్ మామిడిగి నర్సింహులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు, ఎరువుల డీలర్ల మధ్య సత్సంబంధాలు, పరస్పర సహకారం బలోపేతం కావాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగానికి మెరుగైన సేవలందించడంలో సమన్వయం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ తెన్నుగు రాజశేఖర్, సంగన్న పాటిల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కేతకిలో అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గాదేవి...



ఝరాసంగం, అక్టోబర్ 13 (జనంసాక్షి): ఝరాసంగం గ్రామంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మూడవ రోజు ఆలయ అర్చకులు అమ్మవారిని గంధం రంగు చీరతో అలంకరించారు. అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు అమ్మవారి పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్, ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడికి ఘన సన్మానం



కోహీర్, అక్టోబర్ 13 (జనం సాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మనియార్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సువర్ణ మల్లన్న పాటిల్ అభినందనలు తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు వంటి సమస్యల పరిష్కారానికి సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రమేష్, దేవదాస్, చంద్రశేఖర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేటలో సామూహిక కుంకుమార్చనలు

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మంటపం వద్ద దుర్గాభవాని మందిరంలో మంగళవారం మహిళలు నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో సామూహికంగా అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. గడికోటలో మాధవనగర్ కాలనీలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గంగపుత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాలలో అన్నపూర్ణ దేవిగా ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి భక్తులు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు.

## 20 రోజుల పాటు 12 గంటల కరెంట్ సరఫరా చేయాలి

• పంటలు చివరి దశలో ఉన్నాయి
• రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైసయ్య యాదవ్



శివ్వంపేట, అక్టోబర్ 13(జనంసాక్షి): పెట్టుబడుల కోసం వేలాది రూపాయల అప్పులు తీసుకువచ్చి రైతులు సాగు చేసిన పంటలు చివరి దశలో ఉన్నాయని, ఇంకా 20 రోజులపాటు నిరంతరాయమైన 12 గంటల నాణ్యమైన కరెంటును సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తూ, మంగళవారం తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు అక్కమోళ్ల మైసయ్య యాదవ్, కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ వరి పంటలు వేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో యాసంగి వరి పంట వెయ్యకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చి రెండో పంట వేయకుండా ఆరుతడి పంటలకు సంబంధించిన విత్తనాలు సబ్సిడీ అందించాలని, అదేవిధంగా డిసెంబర్ మొదటి వారంలో రాష్ట్రంలో అన్ని గ్రామాలల్లో సభలు ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులతో గ్రామాల్లో అవగాహన సదస్సు పెట్టి రెండో పంట వేయకుండా ప్రభుత్వం చూడాలని మైసయ్య యాదవ్ సూచించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బోయిని రమేష్ యాదవ్, ముఖ్య సలహాదారులు కొండ ఎల్లం యాదవ్, జిల్లా కమిటీ సభ్యులు పెద్దకోళ్ల మల్లేష్, నారాయణ, పరశురాం యాదవ్ యేసయ్య రైతులు ఉన్నారు.

## బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

### బూరం అభినవ్, ప్రిన్సిపాల్, రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్






నంగునూరు, అక్టోబర్ 13 (జనంసాక్షి): బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బూరం అభినవ్ అన్నారు. రాజగోపాలపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ బూరం అభినవ్ మాట్లాడుతూ, ప్రకృతిని పూలతో పూజించే సంప్రదాయం తెలంగాణకు ప్రత్యేకమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మహిళా సిబ్బంది, విద్యార్థినులు కలిసి బతుకమ్మలను పేర్చారు. సంప్రదాయ బద్ధంగా వేడుకలను నిర్వహించి పండుగ విశిష్టతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు సయ్యద్ షాహబాజ్, పాతూరి శ్రీనివాస రెడ్డి, వై.రాజు, ఏవో రాజేశ్ మహిళా సిబ్బంది కవిత, జ్యోతి, దీపిక, మంజుల, వాణి, బాలమణి, లావణ్య, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవిగా.. వనదుర్గమ్మ



పాపన్నపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం. వనదుర్గా క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

మూడవ రోజు మంగళవారం వనదుర్గా మాతను అన్నపూర్ణ దేవి రూపంలో,నీలం రంగు చీరతో పాటు వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. దేవస్థాన సమీపంలోని గోకుల్ షెడ్‌లో ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అర్చకులు మాతకు విశేష పూజలు చేపట్టారు. ఈ అలంకరణలో అమ్మవారు భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు.

### చింతల్ఘట్ దుర్గామాత

## ఆలయంలో శరన్నవరాత్రి పూజలు



కోహిర్, అక్టోబర్ 13 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం చింతల్ఘట్ గ్రామంలోని దుర్గామాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తమ్మలితోట చంద్రశేఖర్ పాటిల్, శ్వేత పాటిల్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబంతో పాటు గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఉత్సవాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దలు, యువ నాయకులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దసరా ప్రత్యేక ఆఫర్లను ప్రకటించిన బజాజ్

• ప్రొప్రయిటర్ జీ. బాలరాజ్



నర్సాపూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ – సంగారెడ్డి ప్రధాన రహదారి పై గల బజాజ్ షోరూమ్ దసరా, దీపావళి పండుగల సందర్భంగా బైక్‌లు కొనుగోలు చేసేవారి కోసం ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ మేరకు షోరూమ్ ప్రొప్రయిటర్ బాలరాజ్ మాట్లడుతూ బజాజ్ బైక్ పై 12 వేల వరకు ఆఫర్ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఒక్క బైక్‌పై 5వేల క్యాష్ ఆఫర్, ఒక హెల్మెట్, 5లీటర్ల పెట్రోల్, బాడీ కవర్, 6 సార్లు ఫ్రీ సర్వీసింగ్ నిర్వహించనున్నాట్లు తెలిపారు. ప్రజలు ఈ ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **కిక్కిరిసిన జనాలు :** బజాజ్ డీలర్ ప్రకటనతో బైకులు కొనడానికి పెద్ద సంఖ్యలో ఆసక్తిని చూపుతున్నారు. సోమవారం నాడు పెద్ద సంఖ్యలో ప్రజలు షోరూమ్‌కు తరలివాస్తున్నారు.

## కల్హేర్‌లో పండుగల కోసం
# విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**కల్హేర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి సహకారంతో కల్హేర్‌లో ప్రత్యేక నిధుల ద్వారా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. తిమ్మానగర్ పానాది నుంచి సొసైటీ గోదాం వరకు సుమారు 10 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. సొసైటీ గోదాం ముందు హైమాస్ట్ దీపం కోసం భారీ పోల్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పండుగలకు వచ్చే భక్తులు, మహిళలకు రాత్రివేళల్లో ఇబ్బందులు తగ్గనున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి. దేవదాస్, సర్పంచ్ కోడి గంగారాం, ఉపసర్పంచ్ పి. మహేష్, పి. బాలిరెడ్డి, పి. మోహన్ రెడ్డి, లైన్‌మెన్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## చందాపూర్‌లో
# సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



**సదాశివపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు నిధులతో చందాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. సదాశివపేట మండల బీజేపీ అధ్యక్షుడు కర్ణం ఆదిత్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లికార్జున్‌తో పాటు బీజేపీ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడిగా బండ జగన్ యాదవ్

- కమిటీ కార్యవర్గం ఎన్నిక



**సిద్దిపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** బిజెపి ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు బండ జగన్ యాదవ్ బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం, బిజెపి మండల అధ్యక్షుడు జాలిగం రమేష్‌ను మంగళవారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించడం జరిగింది. కేంద్రమంత్రి బండి సంజయన్న సారథ్యంలో కోహెడ మండలంలోని బడుగు బలహీన వర్గాల సమస్యలపై పోరాటం చేసేందుకు భారతీయ జన పార్టీ బలోపేతానికి బిజెపి ఓబీసీమోర్చా మండల కమిటీ నూతన కార్యవర్గం పనిచేస్తుందని ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు తెలిపారు. ఈ నూతన కమిటీ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని వారు తెలిపారు.

# భక్తితోనే మనిషిలో సృజనాత్మక శక్తి



**శివ్వంపేట, అక్టోబర్ 13(జనంసాక్షి):** దైవభక్తితోనే మనిషిలో సృజనాత్మకమైన శక్తి పెంపొందుతుందని జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు, శివంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన శివ్వంపేట గ్రామానికి చెందిన వజ్జ నగేష్, వజ్జ హరీష్‌ల నివాసంలో జరిగిన ఎల్లమ్మ కళ్యాణానికి ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు. అదేవిధంగా ఎస్ ఎల్ ఎన్ గ్రూప్ చైర్మన్ కిరణ్మయి సైతం ఎల్లమ్మను దర్శించుకొని అర్చన, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటి కొండ రాజశేఖర్ గౌడ్, కార్యనిర్వాహకులు వజ్జ సత్య నారాయణ, నర్సింలు, రమేష్, హన్మంత్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా ముగిసిన అండర్ 14 కుస్తీ పోటీలు

- ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన పాలమూరు
- జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి
- డిఈఓ గోవిందరాజు

**నారాయణపేట, అక్టోబర్ 13(జనంసాక్షి):** గత మూడు రోజులుగా నారాయణపేట జిల్లా దామరదిద్ద మండలం కానుకుర్తి గ్రామ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో అండర్ 14 లెవెల్ రెజ్లింగ్ పోటీలో ముగిసాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డిఈఓ గోవింద రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ అధ్యక్షతన కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకొనిరావాలి అని అన్నారు. నారాయణపేట జిల్లా చదువులతో పాటు ఆటలలో చాలా ముందు ఉన్నాము,జిల్లా కలెక్టర్ ప్రోద్బలంతో జిల్లాలో రెజ్లింగ్ కు ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తున్నామని, రెజ్లింగ్ ఆటలో పాలమూరు జిల్లా తరుపున నారాయణపేట జిల్లా క్రీడాకారులు నాలుగు గోల్డ్,నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించి మన జిల్లా పేరు నిలబెట్టారు అని అన్నారు.అండర్ 14 రెజ్లింగ్‌లో 20 కేటగిరీలో పోటీలు నిర్వహించారు ఇందులో విజయం సాధించిన వారు ఈనెల 30నుండి న్యూఢిల్లీ త్యాగరాజు స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటారని నారాయణపేట జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ తెలిపారు. పోటీలో విజేతలకు మెడల్స్, బహుమతులను ముఖ్య అతిథులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, కానుకుర్తి గ్రామ సర్పంచు ఎన్ నారాయణ, ఉప సర్పంచ్ యశోద, దామరదిద్ద సింగిల్ విండో చైర్మన్ ఈదప్ప, నారాయణపేట మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ సదాశివరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సురేష్, విద్యాశాఖ కార్యాలయ అధికారులు నాగార్జున రెడ్డి, విద్యాసాగర్, యాదయ్య, సంగీత లు, ఎస్‌జిఎఫ్ మహబూబ్‌నగర్ జిల్లా సెక్రటరీ వేణు గోపాల్,రెజ్లింగ్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నర్సిములు, మండలంలోని సర్పంచులు, వ్యాయమ ఉపాధ్యాయులు వెంకటప్ప, రామకృష్ణ రెడ్డి, బాలరాజ్ గౌడ్,రవి కుమార్, నెల్సన్, సాయినాథ్, బీరప్ప, నర్సింహారెడ్డి, బాలరాజు,నర్సింహారెడ్డి,కోచ్ శ్రీనివాస్, రాజేష్, బస్వరాజు, మండలంలోని వివిధ పార్టీల నాయకులు కానుకుర్తి గ్రామపెద్దలు పాల్గొన్నారు.




# బాచేపల్లిలో వి.బి.జి.రామ్‌జీ గ్రామసభ



**నిజాంపేట్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం వి.బి.జి. రామ్ జీ గ్రామసభ నిర్వహించారు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) పథకంలో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సంగ్రామ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఉపాధి అవకాశాలు, గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుదలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రామసభలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహ ధ్వంసానికి పాల్పడిన వారిని శిక్షించాలి



**బెజ్జంకి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని ఆటోనగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం ఘటనను సిద్దిపేట జిల్లా రజక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి రాజు తీవ్రంగా ఖండించారు. పేద ప్రజల హక్కుల కోసం పోరాడిన వీరనారి విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఘటనకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధ్వంసమైన విగ్రహాన్ని పునరుద్ధరించి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు.

# తరలివచ్చి.. మాతను పూజించి



**పాపన్నపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మండల కేంద్రం పాపన్నపేటలో యువసేన యూత్ ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కోనసాగుతున్నాయి. నీలాగైనీ సమీపన ప్రత్యేకంగా తీర్చిదీద్దిన మండపంలో కొలువు దీరిన దుర్గమ్మకు ఉదయం, సాయంత్రం వేళ అర్చకులు విశ్వనాథం, నవీన్ శర్మలు విశేష పూజలు చేశారు. మంగళవారం మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తున్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

## కబ్జాకు గురైన
# చెరువుపై సర్వే.. త్వరలో హద్దురాళ్ల ఏర్పాటు

### 'జనంసాక్షి' కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు


పేరుకే ప్రజావాణి.. 22 రోజులు గడిచినా పరిష్కారం కాని సమస్య!
జనంసాక్షి



**కోహిర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** చెరువు కబ్జా సమస్యపై 'జనంసాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. 'పేరుకే ప్రజావాణి.. 22 రోజులు గడిచినా పరిష్కారం కాని సమస్య' అనే శీర్షికతో వచ్చిన కథనంపై అధికారులు మంగళవారం చెరువును సందర్శించారు. చెరువు కబ్జాకు గురవుతున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. త్వరలో చెరువుకు సంబంధించిన భూమిని సర్వే చేసి, హద్దురాళ్లు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో చెరువు ఆక్రమణలపై అధికారుల స్పందన పట్ల స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే సర్వ శుభాలు



**కొల్చారం, అక్టోబర్13 (జనంసాక్షి):** ఆదిశక్తి పరాశక్తి శ్రీ రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటే భక్తులందరికీ శుభాలు కలుగుతాయని పాల్వంచ సబితా శ్రీధర్ గౌడ్ దంపతులు అన్నారు. కొల్చారం మండల కేంద్రంలోని శ్రీ రేణుక మాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కొల్చారం గ్రామానికి చెందిన పాల్వంచ సబితా శ్రీధర్ గౌడ్ దంపతులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దంపతులు అమ్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరెంట్ రాజా గౌడ్, రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్, రామా గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, సంజీవరావు, సుధాకర్ గౌడ్, శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిర్గాపూర్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**సిర్గాపూర్, అక్టోబర్ 13(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం లక్ష్మణ్ నాయక్ తండా గ్రామపంచాయతీలో మంగళవారం లబ్ధిదారులకు కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూరి బాయి విట్టల్ నాయక్, ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..** ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా,అవకతవకలు లేకుండా జరుగుతుందని తెలిపారు. బయోమెట్రిక్ విధానంతో లబ్ధిదారులకు నేరుగా సరుకులు అందుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్య, రేషన్ డీలర్ కోలా బస్తీ, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వృద్ధులను గౌరవించాలి: సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య





**అమీన్‌పూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** వృద్ధులపట్ల ప్రతిఒక్కరూ గౌరవంగా వ్యవహ రించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య సూచించారు. మంగళవారం అమీన్‌పూర్ లోని శ్రీవాణి నగర్‌లో ఉన్న ది నెస్ట్ వృద్ధాశ్ర మాన్ని సందర్శించి, వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి నాణ్యమైన ఆహారం, మెరుగైన వైద్య సంరక్షణ, సురక్షిత వాతావరణం కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం వృద్ధుల హక్కులు, సంక్షేమ చట్టాలు, ఉచిత న్యాయ సహాయం పై అవగాహన కల్పించారు. వృద్ధుల సమ స్యల పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. వారి హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

# శ్రీ గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన ముమ్మాదేవి





**రాయికోడు, అక్టోబర్ 13(జనంసాక్షి):** మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయంతోపాటు పలు గ్రామా లలో దేవి నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మూడవ రోజు అయిన మంగళవారం శ్రీ గాయత్రి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు అమ్మవారి దేవాలయాలు,మండపాల వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు కోలాటం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది.ముమ్మా దేవి ఆలయంలో ప్రముఖ కళాకారులు యూసుఫ్ పూర్ ఆంజనేయులు, (హైదరాబాద్) ఈశ్వరయ్య స్వామి,దశరథ్, శివ, నారాయణ, రవి, తదితరుల ఆధ్వర్యంలో భజన కీర్తన నిర్వహించి రాత్రంతా జాగరణ చేశారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతోపాటు పలు గ్రామాల భజన మండలి సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు అండగా కళ్యాణ లక్ష్మి పథకం

- మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి





**మునిపల్లి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** ఆడపిల్లలకు అండగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం సహా యం చేస్తుందని రాయికడు మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మునిపల్లి ల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. మునిపల్లి మండల కేంద్రం లోని రైతు వేదిక వద్ద కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ 76 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచనల మేరకు మండలంలో 76 మంది లబ్ధిదారు లకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింద న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముని పల్లి మండల అధ్యక్షులు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, తహశీల్దార్ రంగా రావు, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రసూల్ పటేల్, నాయకులు నరేందర్ గౌడ్ ఆయా గ్రామాల సర్పంచులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మకు ముమ్మర ఏర్పాట్లు

- చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఘాట్ విస్తరణ.. విద్యుత్ దీపాల ఏర్పాటు
- గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్




**కొల్చారం, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మండల కేంద్రమైన కొల్చారం లో సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగు తున్నాయి. గ్రామ సర్పంచ్ దేవన్నగారి శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక కోతుల చెరువు కట్ట వద్ద బతుకమ్మ ఘాట్‌ను విస్తరించి, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తు న్నారు. బతుకమ్మ ఘాట్‌కు ఇరువైపులా ఉన్న ప్రాంతాన్ని చదును చేయించి, మట్టితో మెట్లు ఏర్పాటు చేశారు. చెరువు కట్టకు ఇరువైపు లా ఉన్న ముళ్ల పొదలను జేసీబీ సహాయంతో తొలగించి, కట్టను చదును చేయించారు. అలాగే చెరువు కట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించి, రాత్రి వేళల్లో మహిళలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు షేకులు, నాయకులు శ్రీశైలం, ప్రశాంత్, పంచాయతీ సిబ్బం ది సిద్దిరాములు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జెమ్లా తండాలో
# రెండో రోజు సోలార్ వ్యతిరేక దీక్ష



**సిర్గాపూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం జెమ్లా తండాలో సోలార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన రెండో రోజుకు చేరుకుంది.మంగళవారం సర్పంచ్ విస్లావత్ పార్వతి బాయి, ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరాహార దీక్ష చేపట్టారు. "మా భూములు మాకు కావాలి, సోలార్ హటావో, జెమ్లా తండా బచావో" అంటూ వారు నినాదాలు చేశారు.

తరతరాలుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములను సోలార్ ప్రాజెక్టు కోసం సేకరించే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. తమ జీవనాధారమైన భూములను కాపాడుకోవాలని, ప్రభుత్వం వెంటనే సోలార్ ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షను ప్రభుత్వం సానుకూలంగా స్పం దించే వరకు కొనసాగిస్తామని సర్పంచ్ పార్వతి బాయి తెలిపారు. ఈ దీక్షలో తుకారం, విస్లావత్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## 151 రకాల పిండి
# వంటలతో వాసవి అమ్మవారికి నైవేద్యం

- శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



**అచ్చంపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మ వారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా 151 రకాల పిండి వంటలు, ఫలహారాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతా వరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు కొరవి శేఖర్, పాపి శెట్టి బాలరాజు, శ్రీనివాసులు, వాడకట్టు వినోద్, నరేష్, వీరబమ్మ, శేఖర్, గోలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్లలో గిరిజనులకు ఇచ్చిన డిక్లరేషన్ అమలు చేయాలి

**అచ్చంపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** పట్టణంలోని గిరిజన సంఘం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు ఎస్.అశోక్ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే కార్యాచరణ అమలు ప్రకటించాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఐక్య ఉద్యమాలు చేపడతావని హెచ్చరిస్తూ తీర్మానం ఆమోదించారు పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి తాండ గ్రామపంచాయతీలకు రెవెన్యూ హోదా కల్పించి తండాల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని ప్రతి గిరిజన తాండ గూడెం గ్రామపంచాయతీలు ప్రత్యేకంగా నిధులు ఇస్తామని 25 లక్షల రూపాయలను తక్షణమే ఇవ్వాలని గిరిజన కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఒక్కొక్క కార్పొరేషన్కు 500 కోట్ల చొప్పు న కేటాయించాలని గిరిజన బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని లంబాడి భాషను గుర్తించి ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని మహాసభలు చేసిన గిరిజన సమస్యలపై తీర్మానాలను ఏకగ్రీవంగా ప్రభుత్వ కార్యాచరణ రూపొందించాలని. ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తండాలలో బ్రతుకుతెరువు కొరకు వలస వెళ్లి జీవన ఉపాధి పనిచేసు కుంటూ జీవన కొనసాగిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో వలసలను అరికట్టి గిరిజనలకు ఉపాధి చూపించాలని ఈ సందర్భంగా ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు ఎల్ దేశ్య నాయక్ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రామవత్ లక్ష్మణ్ నాయక్ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శ్రీని వాస్ నాయక్, ఎస్.లక్పతి నాయక్, శంకర్ నాయక్ దశరథం నాయ క్,జిల్లా కమిటీ సభ్యులు దశరథ నాయక్, కేతావత్ గోపాల్ నాయక్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ధనలక్ష్మి రూపంలో దర్శనమిచ్చిన జమ్మిచేడు జమ్ములమ్మ

- శరన్నవరాత్రులలో పోటెత్తిన భక్తులు



**గద్వాల, అక్టోబర్ 13 (జనంసాక్షి):** నడిగడ్డ ప్రజల ఆరాధ్య దైవం జమ్మిచేడు జమ్ములమ్మ ధనలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అర్చకులు నదీజలా లతో అభిషేకం నిర్వహించి, అర్చన, ఆకు పూజ, హోమం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

లక్షలాది రూపాయల కరెన్సీ నోట్లతో చేసిన ఈ అపూర్వ అలంకరణను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి సైతం జనం భారీగా తరలివస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి విభిన్న అవతారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఆలయ పరిసరాల్లో పోలీసులు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి కృపాకటా క్షాల కోసం భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## శ్రీరంగాపురంలో బతుకమ్మ నిమజ్జన ఘాట్

- వీధి దీపాల సమస్య
- చీకట్లో టెంపుల్ రోడ్డు
- అధికారులు స్పందిస్తారా?

**శ్రీరంగాపురం, అక్టోబర్ 11(జనంసాక్షి):** పండుగల సమయంలోనైనా ప్రజలకు కనీస విద్యుత్ సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని శ్రీరంగాపురం మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బతుకమ్మ నిమజ్జనానికి వెళ్లే ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజలు డిమాండ్ చేస్తున్న సమస్యలు:**

1. బతుకమ్మ నిమజ్జనం కోసం తగిన ఘాట్‌ను ఏర్పాటు చేయాలి.
2. టెంపుల్ రోడ్డు వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలకు వెంటనే బల్బులు ఏర్పాటు చేసి వెలుతురు కల్పించాలి.
3. పాడైన విద్యుత్ బల్బులను మరమ్మతు చేసి, రాత్రివేళల్లో రహదారి వెలుగులతో ఉండేలా చూడాలి.
4. ప్రజల భద్రత కోసం అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలి.

“పండుగలు ప్రజలకు ఆనందాన్ని ఇవ్వాలి కానీ, చీకటి రోడ్లలో భయాందోళనలను కాదు. గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ముఖ్యంగా మండల ఎంపీడీవో గారు ఈ సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి” అని శ్రీరంగాపురం మండల ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## మాగనూర్ ప్రెస్ క్లబ్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**మాగనూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మాగనూర్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని సీనియర్ పాత్రికేయుల ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జి. ప్రహ్లాద్ రెడ్డి, ఎస్. లక్ష్మణ్, అధ్యక్షుడిగా పుంజనూర్ సురేష్, ప్రధాన కార్యదర్శిగా బాల్దాస్ కథలప్ప, ఉపాధ్యక్షులుగా జి.నరేష్, కె.శివకుమార్, కోశాధికారిగా బాల్దాస్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ పత్రికల విలేకరులు పాల్గొన్నారు.

### గద్వాల జిల్లా

## జై నడిగడ్డ యువత నూతన కమిటీ ఎంపిక

- జై నడిగడ్డ యువత జిల్లా కన్వీనర్‌గా జమ్మిచేడు కురువ భాస్కర్



**మల్దకల్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా జై నడిగడ్డ యువత నూతన జిల్లా కమిటీని మంగళవారం ఎంపిక చేశారు.మల్దకల్ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఈ నూతన కమిటీని ఎంపిక చేశారు.ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన జై నడిగడ్డ యువత సభ్యులు హాజరయ్యారు.

జోగులాంబ గద్వాల జిల్లా జై నడిగడ్డ యువత కన్వీనర్‌గా కురువ భాస్కర్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా కో-కన్వీనర్లుగా విద్యా విభాగానికి వినోద్, స్పోర్ట్స్ విభాగానికి మహేందర్,కల్చరల్ విభాగానికి కె.ప్రసాద్, వైద్య విభాగానికి రమేష్ గౌడ్, ట్రెజరర్‌గా రామాంజనేయులు గౌడ్, సోషల్ మీడియా విభాగానికి రమేష్, రామాంజనేయులు బిచుపల్లి, జై నడిగడ్డ యువత గౌరవ సలహాదారుగా రాముడును ఎంపిక చేశారు. మండల కన్వీనర్లుగా మల్దకల్ మండలానికి మధు గౌడ్, కేటీ దొడ్డి మండలానికి రామకృష్ణ,గట్టు మండలానికి నరసింహ గౌడ్, ధరూర్ మండలానికి గోపాల్ నాయుడు, ఐజకు కె. వీరేష్,రాజోలికి విష్ణు, వడ్డేపల్లి మండలానికి లక్ష్మణ్, మనోపాడు మండలానికి మధు, ఉండవెల్లి మండలానికి ప్రవీణ్, ఎర్రవల్లి మండలానికి వినయ్ కుమార్‌లను ఎంపిక చేశారు.నూతనంగా ఎంపికైన జిల్లా కమిటీని శాలువా,పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సభ్యులు, నాయకులు హాజరయ్యారు.

# గ్రామాల భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా





**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి):** జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేసి పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, గ్రామ పాలన అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండలాల వారీగా రీసర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. చిన్నచింతకుంట, కోయిలకొండ, హన్వాడ, జడ్చర్ల, మహబూబ్‌నగర్ రూరల్, అర్బన్, గండీడ్, మూసాపేట తదితర మండలాల్లో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి మండలంలో డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రీసర్వే ప్రారంభానికి ముందు గ్రామసభలు నిర్వహించి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా రైతులకు, గ్రామ ప్రజలకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ భూములు, పట్టా భూములు, గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం భూముల సర్వేను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు.

జడ్చర్ల మండలంలోని ఖానాపూర్, అమ్మాపూర్, అడ్డాకల్ మండలంలోని హాజీపూర్, పొన్నకల్, మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జమిస్తాపూర్, కోటకదిరతో పాటు మూసాపేట పరిధిలో రీసర్వే పనులు ఆలస్యంగా జరుగుతున్నట్లు గుర్తించారు. పనుల జాప్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లైసెన్స్ సర్వేయర్లు, రోవర్ల కొరతతో పాటు సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన పరికరాలను జిల్లా సర్వే కార్యాలయం నుంచి సమకూర్చుకోవాలని తెలిపారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించి గడువులోగా రీసర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎ.యాదగిరిని రీసర్వే పనుల నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.నిర్మల, ఆర్డీఓ నవీన్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కౌన్సిలర్ షరీఫా బేగం



**చేర్యాల, అక్టోబర్ 13 (జనంసాక్షి):** చేర్యాల మున్సిపల్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని 12వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ షరీఫా బేగం ఖాజా మంగళవారం సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పప్పు, నూనె తదితర వస్తువులను పంపిణీ చేశారు. ప్రీ ప్రైమరీ పిల్లలకు పౌష్టికాహార వస్తువులను అందించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు గుస్క బాలమణి, కొడిగింజ లక్ష్మి, వార్డుప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షునిగా కావలి మహేష్ ఏకగ్రీవ ఎన్నిక



**వీపనగండ్ల, అక్టోబర్ 14 (జనంసాక్షి):** వీపనగండ్ల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక,పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు నమ్మిన బంటు విధేయుడైన కావలి మహేష్ గ్రామ అధ్యక్షుడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి క్యాతం కురుమయ్య తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ చైర్మన్ ఎస్ రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పాము రాజశేఖర్, వార్డు సభ్యులు సుధాకర్, డిజె శివ, గడ్డమీద ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న బిగ్ బాస్ యాంకర్స్

- తూప్రాన్ మహంకాళి దేవాలయంలో ప్రముఖ నటీమణుల ప్రత్యేక పూజలు



**తూప్రాన్, అక్టోబర్ 13(జనంసాక్షి):** నవదుర్గ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తూప్రాన్ తూప్రాన్ మహంకాళి దేవాలయంలో నిర్వహించే నవరాత్రుల్లో అమ్మవారిని ప్రముఖ నటీమణులు బిగ్‌బాస్ ఫేమ్, ఆశు రెడ్డి, ప్రవీణాలు, వారి కుటుంబ సభ్యులు రాకేష్ రెడ్డి అనిల్ దంపతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయం వద్ద సందడి చేశారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు రాష్ట్ర ఐవిఎఫ్ కోశాధికారి కొడిప్యాక నారాయణ గుప్తా ఆధ్వర్యంలో ప్రముఖ నటులు దేవాలయానికి విచ్చేసి అమ్మవారికి కుంభహారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిగ్బాస్ బిగ్ బాస్ ఫ్రేమ్ నటీమణులు ఒక్కసారిగా దేవాలయంలో ప్రత్యక్షమవడంతో అభిమానులు సెల్ఫీ తీసుకొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కోటేశ్వరరావు ,తాటి విట్టల్, శంకరంపేట్ నాగరాజు గౌడ్, సూర్య ప్రకాష్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ ,శ్రీనివాస్ రెడ్డి, కంటాయపాలెం వేణుగోపాల్ ,తాటి విట్టల్, పోతరాజు, నాగరాజు, మధు తదితరులు పాల్గొన్నారు

## మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి

- ఉర్కొండ ఎస్సై రమాదేవి



**ఉర్కొండ, అక్టోబర్ 13 (జనంసాక్షి);** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో దుర్గామాత మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఉర్కొండ ఎస్సై రమాదేవి సూచించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాత్రి సమయంలో మండపాల వద్ద వాలంటీర్లను నియమించుకోవాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా భక్తులు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయకర్తగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

### వనపర్తి శాసనసభ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ




**వనపర్తి బ్యూరో,అక్టోబర్ 13 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించింది.

ఇందులో భాగంగా వనపర్తి శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్తగా స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని నియమించింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ అక్టోబర్ 13న ఉత్తర్వులు జారీ చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ విజయవంతమయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.

### దసరా వేడుకలకు
## మాజీ మంత్రి హరీష్ రావుకు ఆహ్వానం




**అమీన్పూర్, అక్టోబర్ 13(జనంసాక్షి):** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమీన్‌పూర్ గ్రామ పరిధిలోని పెద్ద చెరువు వద్ద నిర్వహించనున్న విజయదశమి పర్వదిన రావణ దహన మహోత్సవానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు.

అమీన్‌పూర్ గ్రామ పెద్దలతో కలిసి పాండు రంగారెడ్డి మాజీ మంత్రిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

పెద్ద చెరువు ప్రాంగణంలో తమ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్న దసరా సంబరాలు, రావణ దహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్ కృష్ణ, బిజిలి రాజు, అమీన్‌పూర్ గ్రామ పెద్దలు, ఉపేందర్ రెడ్డి, కొల్లూరి గోపాల్, కొల్లూరు యాదగిరి, హరినాథ్, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అజాగ్రత ప్రయాణంలో విషాదం



**పాపన్నపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** అజాగ్రత ప్రయాణంలో ప్రమాదవశత్తూ ఓ వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన పాపన్నపేట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు .. గాజులగూడెం గ్రామానికి చెందిన పుట్టల సాయిలు (45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. సోమవారం సాయంత్రం సమయంలో ఇదే గ్రామానికి చెందిన ఇస్మాయిల్ తో కలిసి ట్రాక్టర్ తీసుకు రావడానికి ఎన్కేపల్లి కీ వెళ్లి రాత్రి సమయంలో అక్కడ ఓ ఇంటి వద్ద ట్రాక్టర్ లో మట్టి నింపుకొని ఊరి బయటకు వస్తున్నారు. ఇస్మాయిల్ ట్రాక్టర్ నడుపుతుం డగా సాయిలు పక్కన కూర్చున్నాడు. ఈక్రమంలో అజాగ్రత్తగా నడపడంతో సాయిలు ట్రాక్టర్ పై నుంచి కింద పడగా ట్రాలీకి ఉన్న టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై ఘటనా స్థలం లోనే మృతి చెందాడు. కుటుంబీకులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు .

### బతుకమ్మ, దసరా
## పండుగల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- చేర్యాల సిఐ రమేష్ నాయక్



**చేర్యాల, అక్టోబర్ 13(జనంసాక్షి):** బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సిఐ రమేష్ నాయక్ సూచించారు. సెలవుల నేపథ్యంలో ఊర్లకు వెళ్లే వారు ఇంటికి తాళం వేసిన విషయాన్ని పక్కింటి వారికి, పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నవరాత్రుల్లో దుర్గా మండపాల వద్ద డీజేలు, లక్కీ డ్రాలు నిర్వహించరాదన్నారు. రాత్రి వేళల్లో కనీసం నలుగురు మండపం వద్ద కాపలా ఉండాలని, రావణ దహనం నిర్వహించే వారు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, సద్దుల బతుకమ్మ రోజు మహిళలు, పిల్లలు గుంపుగా ఉంటారు కాబట్టి అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి, అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, దసరా రోజు మద్యం మత్తులో గొడవలు, ఇతరులకు ఇబ్బంది కలిగించడం, వాహనాలు నడపడం చేయవద్దు. పండుగకు వెళ్లే వారు జాగ్రత్తగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

## గాయత్రి మాతగా వాసవి మాత అలంకరణ



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించారు. ఆలయ పూజారి పాండురంగ శర్మ ఆధ్వర్యంలో సామూహిక పూజలు, గణపతి, సుబ్రహ్మణ్య, దుర్గా, సరస్వతీ, లక్ష్మీ హోమాలు నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర పారాయణం, సామూహిక కుంకుమార్చన, పల్లకీ సేవ, డోలోత్సవం నిర్వహించారు. దుర్గాభవాని బృందం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అనంతరం ఆర్యవైశ్య మహిళా కమిటీ ఆధ్వర్యంలో తంబోలా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన



**రాయికోడ్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** రాయికోడ్ గ్రామపంచాయతీ కారోబార్ మంగలి సత్తయ్య నూతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆత్మ కమిటీ చైర్మన్ ఎన్. కచూర్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల కేదార్నాథ్ పాటిల్ తదితరులు టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమం లో సతీష్ కులకర్ణి, జంబికి వినయ్ కుమార్, జి. విట్టల్, సంగ మేశ్వర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నపూర్ణాదేవి
## అవతారంలో అమ్మవారి దర్శనం..

- అన్నదాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు



**అమీన్పూర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** అమీన్‌పూర్ పట్టణ పరిధి లోని బీరంగూడ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో నిర్వహిస్తున్న నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు అన్నపూర్ణా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారర్నీ. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### శ్రీ అన్నపూర్ణాదేవిగా
## వాసవి మాత అలంకరణ



**మల్దకల్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మల్దకల్ శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు వాసవి మాతను శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు చైతన్య వేదమంత్రాలతో హోమం నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన లో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారి అనుగ్రహంతో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, జ్ఞానం కలుగుతాయని భక్తులు విశ్వసించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### రోడ్డు పనులకు
## భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**మల్దకల్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** ఇంతేగాక దాసంగాలు సమర్పించడానికి కూడా ఎంతో వేలుగా ఉంటుందని తెలిపారు.ఆలయ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,ఆలయ వ్యవస్థాపక వంశీయులు చైర్మన్ ప్రహల్లాదరావు, జిల్లా సీనియర్ నాయకులు సత్యరెడ్డి,సీతారాం రెడ్డి,మాజీ గ్రంథాలయ చైర్మన్ రామన్ గౌడ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ వీరన్న, నాయకులు వెంకటన్న, తిమ్మ రాజు, ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగరాజు యువ నాయకులు ప్రవీణ్ తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు అందుబాటులో
## శనగ విత్తనాలు: ఏవో లావణ్య



**శివ్వంపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం లోని రైతులకు అందుబాటులోకీ శనగ విత్తనాలు రావడం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా నమోదు అయ్యాయని, వచ్చే యాసంగిలో రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలు వేసుకోవాలి ఆమె సూచించారు. శివంపేట రైతు వేదిక లో శనగ విత్తనాలు సబ్సిడీ లో ఉన్నాయని, విత్తనాలు కావాల్సిన రైతులు రైతు వేదిక వద్దకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 16 కిలోల బస్తా, 752 రూపాయలుగా ఉందన్నారు.

## అన్నపూర్ణ దేవిగా చండిక మాత



**శివ్వంపేట, అక్టోబర్ 13 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం చండీ గ్రామంలో వెలసిన చండిక మాత అమ్మవారి నవ రాత్రులలో భాగంగా 3వ రోజు అన్న పూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని సుందర వదనంగా అలంకరించి, పలు రకాల వంటలతో మహా నైవేద్యం నివేదించారు. పాడిపంటలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, అమ్మవారిని ప్రత్యేక పూజల ద్వారా వేడుకున్నారు.

## ఏకపక్ష గ్రామ కమిటీని రద్దుచేయాలి



**చేర్యాల, అక్టోబర్ 13 (జనంసాక్షి):** చేర్యాల మండలం కమలాయపల్లి లో ఏకపక్షంగా ప్రకటించిన కాంగ్రెస్ గ్రామ కమిటీని వెంటనే రద్దు చేయాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. మండల ఉపాధ్యక్షుల సమక్షంలో సుమారు 40 మంది క్రియాశీలక సభ్యులు గ్రామ శాఖ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నప్పటికీ, ఆ నిర్ణయాన్ని విస్మరించి ఇతరులకు పదవులు కట్టబెట్టడం సరికాదన్నారు. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గ్రామానికి వచ్చి అందరికీ ఆమోదయోగ్యమైన అధ్యక్షుడిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

### ఉర్కొండపేటలో
## వ్యవసాయ గణన సర్వే ప్రారంభం



**ఉర్కొండ, అక్టోబర్ 13 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం ఉర్కొండపేట గ్రామంలో జాతీయ గణాంక కార్యాలయం హైదరాబాద్ క్షేత్రస్థాయి అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ గణన సర్వే నిర్వహించారు. సర్వే సూపర్‌వైజర్ మహమ్మద్ హఫీజ్ నేతృత్వంలో వ్యవసాయ భూములను పరిశీలించి, రైతులు సాగుచేస్తున్న పంటల రకాలు, విస్తీర్ణం తదితర వివరాలను సేకరించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ఖచ్చితమైన గణాంకాల సేకరణే సర్వే ప్రధాన ఉద్దేశమని హఫీజ్ తెలిపారు. ఈ సమాచారం ప్రభుత్వ వ్యవసాయ ప్రణాళికలు, విధానాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అబ్దుల్ రషీద్, ఉపసర్పంచ్ రేపాని శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కల సాకారం...

**మార్చాలలో 18 ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి**




**కల్వకుర్తి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ మార్చాల గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన 18 నూతన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని,నూతన గృహాల్లోకి అడుగు పెట్టిన లబ్ధిదారులను అభినందించారు. అంతకుముందు కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన మేదర మహేంద్ర సంఘం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం మార్చాల గ్రామానికి చేరుకుని ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారితో చర్చించారు. గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు బాధ్యతలు..

- కల్వకుర్తి సమన్వయకర్తగా ఎమ్మెల్యేకసిరెడ్డి
- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలకుల నియామకం
- ఓటరు నమోదు ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని ఆదేశాలు

**కల్వకుర్తి,అక్టోబర్ 13(జనంసాక్షి):** రానున్న తెలంగాణ శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిశీలకులను నియమించింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్, వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో ఈ నియామకాలు చేపట్టినట్లు కమిటీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని 83--కల్వకుర్తి శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. నియమితులైన పరిశీలకులు,సమన్వయకర్తలు సంబంధిత జిల్లాల నాయకులతోసమన్వయం చేసుకుంటూ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కమిటీ ఆదేశించింది.

# ఎమ్మెల్సీగా డా.చంద్రశేఖర్‌కు అవకాశం కల్పించాలి

**సీనియర్ నాయకుడికి సముచిత గుర్తింపు ఇవ్వాలి: మహమ్మద్ అష్రఫ్ అలీ**




**కోహిర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని కోహిర్ మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ అష్రఫ్ అలీ కోరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజాసేవలో విశేష అనుభవం కలిగిన డాక్టర్ చంద్రశేఖర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ద్వారా ఆయన సేవలకు తగిన గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు.ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా పనిచేసిన డాక్టర్ చంద్రశేఖర్‌కు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని అష్రఫ్ అలీ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ ఆయన భాగస్వామిగా పనిచేశారని గుర్తుచేశారు. ఎన్నో రాజకీయ పరిణామాలు ఎదుర్కొన్నప్పటికీ ప్రజలతో సంబంధాలు కొనసాగిస్తూ రాజ కీయాల్లో చురుకుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి డాక్టర్ చంద్రశేఖర్ కృషి చేస్తున్నారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి కల్పిస్తే సీనియర్ నాయకుడికి గౌరవం దక్కడంతో పాటు సామాజిక న్యాయానికి కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవుల భర్తీపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, డాక్టర్ చంద్రశేఖర్, అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మహమ్మద్ అష్రఫ్ అలీ కోరారు. ఆయనకు అవకాశం కల్పించాలని పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రైతులకు వేరుశనగ బస్తాలు పంపిణీ...

**నంచర్ల రైతు వేదికలో సుమారు 180 క్వింటాళ్ల వేరుశనగ బస్తాలను రైతులకు పంపిణీ...**




**మహమ్మదాబాద్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** రైతులకు సాగు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గ్రామ రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సుమారు 180 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ఏవో నరేందర్, మండల అధ్యక్షుడు కేం నారాయణ, గ్రామ సర్పంచ్ గాయత్రిదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఏవో నరేందర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. వేరుశనగ సాగు చేపట్టే రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించి విత్తనాలను పొందాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచుతూ,సాగు పనులకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకొని,సాగు ప్రణాళిక ప్రకారం పంటలు సాగుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీకాంత్ రెడ్డి, బాంటూ హన్మంత్, బాల్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

# డబుల్ రోడ్డు, వంతెనలు మంజూరు చేసిన మోదీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు



**మక్తల్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** ఉట్కూరు మండలంలోని పెద్దజట్రం గేట్ నుండి మక్తల్ మండలంలోని జక్లేర్ గేట్ వరకు 100% కేంద్ర ప్రభుత్వ సి ఆర్ ఐ ఎఫ్ నిధులు రూపాయలు 36 కోట్లు మంజూరు చేసి డబుల్ రోడ్డు, వంతెనల పనులు ప్రారంభించిన మోదీ ప్రభుత్వానికి సామాజిక కార్యకర్త హెచ్ . నర్సింహ ప్రయాణికుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. వారు అవసలోనిపల్లి వాగు దగ్గర నిర్మిస్తున్న వంతెన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బి టి రోడ్డు గురించి, వంతెనల గురించి ఎన్నోసార్లు అధికారులకు, మంత్రులకు, ముఖ్యమంత్రి కి వినతి పత్రాలను ఇవ్వడం జరిగింది అని, సోషల్ మీడియా ఎక్స్ వేదికగా కోరడం జరిగింది అని తెలిపారు. వర్షాకాలంలో అవుసలోని పల్లి వాగు పారుతుంటే బస్సు అక్కడనే ప్రయాణికులను దింపి డిపోకు రిటర్న్ పోతే ఆ వాగు దగ్గరనే నిరసన కార్యక్రమాలు చేసి పెద్దజట్రం, అవసలోనిపల్లి, బిజ్వార్ మరియు పులిమామిడి చెరువు కట్ట దగ్గర వంతెన నిర్మించి డబుల్ రోడ్డు వేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. ప్రయాణికుల కష్టాలను అర్థం చేసుకొని డబుల్ రోడ్డు మరియు వంతెనలను మంజూరు చేసిన పాలమూరు ఎంపీ డీకే అరుణ కు మరియు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఈ రోడ్డును గుత్తేదారులు కొందరు బెదిరిస్తే మామూలు ఇచ్చి రోడ్డు పనులను నాసిరకంగా చేయడం వలన సంవత్సరంలోపే పాడయింది కావున గుత్తేదారు ఎవరికి భయపడకుండా, మామూళ్లు ఇవ్వకుండా రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని కోరారు. ఎవరైనా బెదిరిస్తే మా దృష్టికి తీసుకుని వస్తే వారిని ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెట్టి మరొకసారి ఇలాంటి పనులు చేయకుండా చేస్తామని తెలిపారు. గడువులోపు పనులను పూర్తి చేసి ప్రయాణికుల యొక్క కష్టాలు తీర్చాలని సూచించారు.

# దీక్ష స్వాములకు అండగా జర్పుల భాస్కర్ నాయక్..

- రూ.10 వేల ఆర్థిక సాయం!



**బాలానగర్, అక్టోబర్ 13(జనంసాక్షి):** మానవ సేవే మాధవ సేవ అనే స్ఫూర్తితో సామాజిక కార్యకర్త జర్పుల భాస్కర్ నాయక్ మరోసారి తన సేవా గుణాన్ని చాటుకున్నారు. బాలానగర్ మండలంలోని పలుగుమీది తండాలో దీక్ష చేపట్టిన స్వాములకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.
సర్పంచ్ కుమార్ నాయక్, ఈశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో జేబీఎన్ టీమ్ సహకారంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షలో ఉన్న స్వాములకు అవసరమైన సహకారం అందించాలనే ఉద్దేశంతో జర్పుల భాస్కర్ నాయక్ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవాభావానికి ప్రాధాన్యతనిస్తూ దీక్ష స్వాములకు అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం ద్వారా మానవత్వం, ఐక్యత, పరస్పర సహకారం మరింత బలోపేతమవుతాయని అన్నారు.
సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తూ సామాజిక బాధ్యతను చాటుకోవడం స్ఫూర్తిదాయకమని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం భక్తి భావంతో పాటు సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.

# జెడ్పీ కార్యాలయ స్థలంపై ఆక్రమణల ఆరోపణలు



**గద్వాల, అక్టోబర్ 13 (జనంసాక్షి):** గద్వాల జెడ్పీ కార్యాలయంలోని ఖాళీ స్థలం ఆక్రమణలకు గురవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు వెదురు తడకలను నిల్వ చేస్తూ గోదాముగా వినియోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ మూత్రశాల పైకప్పుపై ట్యాంక్ ఏర్పాటు చేసి, నీటిని వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారని పేర్కొన్నారు.
అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాలయ ప్రాంగణంలో వ్యాపార సామగ్రి నిల్వ చేయడం వల్ల ఇక్కడికి వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులు స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

# వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు





**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 13 (జనంసాక్షి):** వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, ఆయన సతీమణి శారదారెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వయుజ మాస శుక్లపక్ష తదియ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అభిషేక కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలకు శాంతి, సౌభాగ్యం, సకల శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే దంపతులు తెలిపారు. అనంతరం వేద పండితులు మంగళ వాయిద్యాల నడుమ ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వచనాలు అందించారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ బ్రహ్మంచారి, ఎస్ఎల్ఎన్ రమేష్, కౌన్సిలర్లు పితాంబరం, రవి యాదవ్, శాంతి కుమార్ గౌడ్, పరుశురాం, చుక్క రాజుతో పాటు పట్టణ ప్రముఖులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వాకిటి శ్రీధర్.. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్





**వనపర్తి బ్యూరో, అక్టోబర్13 (జనంసాక్షి):** వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో వెంకటాచారి నివాసంలో భారత్ గ్యాస్ సిలిండర్ పేలడంతో తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న జిల్లా అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో ఇంటికి, ఫర్నిచర్‌కు జరిగిన నష్టానికి బాధిత కుటుంబానికి భారత్ గ్యాస్ కంపెనీ తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే భారత్ గ్యాస్ కార్యాలయం ఎదుట తీవ్ర ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల రీ సర్వేకు శ్రీకారం



**రాజోళి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మండలంలో భూముల రీ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో తూర్పు గార్లపాడు గ్రామ శివారులోని పంట పొలాలను ఆధునిక సర్వే యంత్రం ద్వారా కొలతలు చేపట్టారు. భూముల హద్దుల గుర్తింపు, భూ వివాదాల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్వేయర్ రామకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా భూములకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామకృష్ణ, జీపీఓ సుల్తానా, రాజు, నాగన్న, చైన్‌మెన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి
# రూ.2 లక్షల ఎల్ఓసీ అందజేత



**కల్హేర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** కృష్ణాపూర్ గ్రామానికి చెందిన అనారోగ్య బాధిత కుటుంబానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అండగా నిలిచారు. ప్రభుత్వంతో రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించి, బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# సూరారంలో కుక్కల బెడద.. గ్రామస్తుల ఫిర్యాదు



**బాలానగర్, అక్టోబర్ 13 (జనంసాక్షి):** మండలంలోని సూరారం గ్రామం 6వ వార్డులో వీధి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు అధికారులను కోరారు. మంగళవారం వార్డు సభ్యురాలు శారదమ్మతో కలిసి గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి రాంబాబును కలిసి సమస్యపై ఫిర్యాదు చేశారు.

వీధి కుక్కల సంచారంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల బెడద కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామంలో వీధి కుక్కల బెడదను తగ్గించి, చిన్నపిల్లలు, వృద్ధులు ఎలాంటి భయాందోళనలు లేకుండా సంచరించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన.. ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

- **డీఈవోకు బీజేపీ నాయకుల వినతిపత్రం..**
- **నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరపాలని డిమాండ్**



**వనపర్తి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** రాజ్యాంగబద్ధ సంస్థ అయిన భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టడంపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, సేవా నియమావళిని ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు రాజ్యాంగబద్ధ సంస్థల పట్ల గౌరవంతో పాటు తమ విధులు, సేవా నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధన చేయడంతోపాటు క్రమశిక్షణ, రాజ్యాంగ విలువలు, పౌర బాధ్యతలను నేర్పాల్సిన ఉపాధ్యాయులు తమ ప్రవర్తనలోనూ ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలో ఉపాధ్యాయులు పాల్గొన్న అంశంపై విద్యాశాఖ అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని ఆయన కోరారు. సంబంధిత నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే చట్టాలు, సేవా నియమావళి ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని బీజేపీ నాయకులు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ కొండోజు గోపీనాథ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నలవోతుల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణాదేవిగా శ్రీ బంగారు మైసమ్మ



**జడ్చర్ల, అక్టోబర్ 13 (జనంసాక్షి):** అన్నపూర్ణే సదాపూర్ణే శంకర అంటూ భక్తులు జడ్చర్లలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా 3వ రోజు మంగళవారం శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవతను అన్నపూర్ణాదేవిగా మనోహరంగా అలంకరించి పూజించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. అన్నపూర్ణాదేవి అలంకరణను పురస్కరించుకొని పరిగి దామోదర్ రెడ్డి సునీత రెడ్డి, గజగౌని రమేష్ గౌడ్ సుప్రియ దంపతులు సమకూర్చిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని దేవాలయం ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో గోనెల నరేందర్ మహేశ్వరి, విజయ్ కుమార్ గౌతమి ప్రియాంక, మహేష్ మాధురి దంపతులతో పాటు,మిద్దె నాగరాజు, అనన్య, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# బడ్జెట్ ఉన్నా ఆస్పత్రి కార్మికులకు అందని జీతాలు

- **నేటి నుంచి జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో కార్మికుల మెరుపు సమ్మె**




**జడ్చర్ల, అక్టోబర్ 13 (జనంసాక్షి):** జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ నేటి నుంచి మెరుపు సమ్మె చేపడుతున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగల సమయానికి కూడా పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఆగస్టు వరకు బడ్జెట్ విడుదల చేసినప్పటికీ, అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, వేతనాలు చెల్లించేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భాగీ కృష్ణయ్య, యూనియన్ నాయకులు నాగరాజు, రాజేష్, అబ్దుల్ వహీద్, విజయలక్ష్మి, మన్నెమ్మ, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలు ఆపి రైతుల కష్టాలపై సమాధానం చెప్పాలి

- **బీజేవైఎం కృష్ణ మండల అధ్యక్షులు వొట్టేవోళ్ళ సురేష్**



**కృష్ణ, అక్టోబర్ 13 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇటీవల దేవుళ్లను రాజకీయ చర్చలోకి తీసుకువస్తూ చేసిన వ్యాఖ్యలపై బీజేవైఎం కృష్ణ మండల అధ్యక్షులు వొట్టేవోళ్ళ సురేష్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో పంట కోసం పెట్టుబడి పెట్టిన రైతులు కరెంటు, నీళ్ల కోసం కన్నీళ్లు పెట్టుకుంటే మన సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల ఆరాధ్య దైవాలను రాజకీయ పార్టీలకు, కులాలు- ప్రాంతాలకు అన్వయిస్తూ మత రాజకీయాలు చేస్తున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ రెడ్డి రాముడు-శివుడు, ఆర్య-ద్రావిడ అంశాలను ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వివాదానికి దారి తీశాయి. తాజాగా గోవాలో జరిగిన కాంగ్రెస్ కార్యక్రమంలో బీజేపీని రావణుడితో, కాంగ్రెస్‌ను రాముడితో పోలుస్తూ ఓటర్లను కాంగ్రెస్‌కు మద్ద తివ్వాలని ఆయన పిలుపు నివ్వడం విడ్డూరమని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను విమర్శించడానికి దేశ ప్రజల ఆరాధ్య దైవాలను రాజకీయాల్లోకి లాగడం ఏ విధమైన రాజ కీయ సంస్కృతి? రాముడు ఒక పార్టీకి చెందినవాడు కాదు.. శివుడు మరో పార్టీకి చెందినవాడు కాదు. కోట్లాది మంది ప్రజల విశ్వాసానికి ప్రతీకలైన దేవుళ్లను రాజకీయ సమీకరణాల కోసం ఉపయోగించడాన్ని ప్రజలు గమనిస్తున్నారు” అని అన్నారు.“రైతు పొలంలోకి నీళ్లు రావాలి.. మోటారుకు కరెంటు రావాలి”“దేవుళ్లపై వ్యాఖ్యలు చేసి ప్రజల దృష్టిని మళ్లించడం కాదు.. రైతు పొలంలో పంట పరిస్థితి ఏంటి? రైతు బోరు మోటారుకు సమయానికి విద్యుత్ అందుతోందా? సాగునీరు అందుతోందా? అనే ప్రశ్న లకు ప్రభుత్వం సమాధానం చెప్పాలి” అని సురేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్, సాగునీరు, పంటల సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టాలని, వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా, యువత, పేదల సమస్య ల పై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. రాజకీయ విమర్శలకు దేవుళ్లను అడ్డుపెట్టు కోవడం మానేసి ఇచ్చిన హామీల అమలుపై సీఎం రేవంత్ రెడ్డి శ్వేత పత్రం విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. రైతుకు కావాల్సింది రాజకీయ నినాదాలు కాదు, సాగునీరు, నిరంతర విద్యుత్, పంటకు గిట్టుబాటు ధర, ప్రభుత్వ భరోసా. ఇవే తమ ప్రధాన డిమాండ్లని ఆయన స్పష్టం చేశారు. దేవుళ్లను ఓట్ల రాజకీయా లకు వాడొద్దనని హితవు పలికారు.

## మహమ్మదాబాద్‌లో గడువు ముగిసిన పురుగుమందుల విక్రయాలు!

- **రైతుల పంటలతో చెలగాటం..ఫర్టిలైజర్ షాపులో ఎక్స్‌పైరీ మందులు!**
- **2021 నాటి మందులు.. 2026లో అమ్మకాలా?**
- **ఫర్టిలైజర్ షాపులపై వ్యవసాయ శాఖ నిఘా ఏదీ?**
- **పంట సంరక్షణ మందుల పేరుతో..రైతులకు నష్టమా?అధికారుల తనిఖీలు ఎక్కడ..**







**మహమ్మదాబాద్,అక్టోబర్ 13(జనంసాక్షి):** రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ అందించాల్సిన ఫర్టిలైజర్ షాపులో గడువు ముగిసిన వ్యవసాయ మందులు విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.మహమ్మదాబాద్ మండలంలోని ఓ ఎరువులు,పురుగుమందుల దుకాణంలో ఎక్స్‌పైరీ తేదీ దాటిన మందులను రైతులకు విక్రయించినట్లు సమాచారం.అదే మండలానికి చెందిన ఓ రైతుకు గడువు ముగిసిన మందులను విక్రయించినట్లు ఆరోపణలు రావడం వ్యవసాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2021 నాటి మందులు.. 2026లో విక్రయాలా 2021 ఆగస్టులో తయారైనట్లు పేర్కొంటున్న కొన్ని వ్యవసాయ మందు లు గడువు ముగిసినప్పటికీ, 2026లో విక్రయానికి ఉంచినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఆయా మందుల తయారీ తేదీలు,గడువు వివరాలు,విక్రయాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.వ్యవసాయంలో వరి సాగుతోపాటు ఇతర పంటలకు తెగుళ్లు,చీడపీడల నివారణ కోసం రైతులు పురుగు మందులు, శిలీంధ్రనాశకాలు ఇతర పంట సంరక్షణ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు.పంటల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన మందులను ఎంపిక చేసుకోవడం ఎంత ముఖ్యమో,వాటి గడువు తేదీలను పరిశీలించడం కూడా అంతే అవసరం.గడువు ముగిసిన మందుల విక్రయాల వల్ల రైతులు పెట్టుబడి నష్టాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉండటంతోపాటు,ఉత్పత్తి నాణ్యతపై సందేహాలు తలెత్తే అవకాశం ఉంది.

### వ్యవసాయ శాఖ పర్యవేక్షణ ఏది?

మండల పరిధిలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువుల నిల్వలు, పురుగు మందుల నాణ్యత, బ్యాచ్ నంబర్లు, తయారీ తేదీలు, గడువు తేదీలు, విక్రయ రికార్డులను వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.ఈవ్యవహారంలో అధికారుల పర్యవేక్షణ లోపించిందా గడువు ముగిసిన మందులు విక్రయానికి ఎలా వచ్చాయి?సంబంధిత దుకాణంలో నిల్వలను తనిఖీ చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి,సదరు ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు నిర్వహించాలని,గడువు ముగిసిన మందుల విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ అందేలా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- **పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి: అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**

**వనపర్తి, అక్టోబర్ 13 (జనంసాక్షి):** జిల్లాలో బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించడంతో పాటు పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, పర్యాటక శాఖ ఎండీ వల్లూరు క్రాంతి జిల్లా అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, బతుకమ్మ వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు




తీసుకోవాలన్నారు.

అక్టోబర్ 14న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, అక్టోబర్ 15న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, అక్టోబర్ 16న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా శాఖలకు కేటాయించిన తేదీల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు.



అదేవిధంగా జిల్లాలో పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి, వాటి అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ యాదయ్య, డీపీఆర్వో సీతారాం, డీవైఎస్‌వో సుధీర్ రెడ్డి, డీడబ్ల్యూఓ సుధారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కల్తీ లేని బంధాలకు కాలం చెల్లిందా?

### సెల్‌ఫోన్ దగ్గర చేస్తుందా.. దూరం చేస్తుందా?

సాంకేతిక పరిజ్ఞానం మానవ జీవితాన్ని సులభతరం చేసింది. ప్రపంచంలోని ఏ మూలన ఉన్నవారితోనైనా క్షణాల్లో మాట్లాడుకునే అవకాశం కల్పించింది. సమాచారం తెలుసుకోవడానికి, విద్యాభ్యాసానికి, ఉపాధి అవకాశాలకు సెల్‌ఫోన్ ఎంతో ఉపయోగపడుతోంది. అయితే అవసరానికి మించి వినియోగించినప్పుడు అదే సాధనం మనుషుల మధ్య దూరాన్ని పెంచే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఇతరుల జీవితాలను చూస్తూ సమయాన్ని గడుపుతున్న చాలామంది తమ కుటుంబ సభ్యుల భావాలను, స్నేహితుల ఆప్యాయతలను పట్టించుకోవడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

గతంలో సాయంత్రం వేళల్లో ఇంటి ముందు కూర్చొని కబుర్లు చెప్పుకోవడం, పిల్లలు వీధుల్లో ఆటలాడుకోవడం, పెద్దలు తమ అనుభవాలను చిన్నవారికి వివరించడం కనిపించేది. నేడు అలాంటి దృశ్యాలు చాలా ప్రాంతాల్లో తగ్గుముఖం పడుతున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు మొబైల్ ఫోన్లకే ఎక్కువ సమయం కేటాయిస్తుండటంతో ప్రత్యక్ష పరిచయాలు, పరస్పర సంభాషణలు తగ్గుతున్నాయి. బంధుత్వాలు కేవలం పండుగ శుభాకాంక్షల సందేశాలకే పరిమితమవుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### మనసుకు చార్జింగ్ ఇచ్చేదెవరు?

ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు పనిచేయడానికి చార్జింగ్ ఎంత అవసరమో.. మానవ మనసుకు ఉత్సాహం, ప్రశాంతత, ప్రేమ, ఆప్యాయతలు అంతే అవసరం. సెల్‌ఫోన్ బ్యాటరీ అయిపోతే వెంటనే చార్జర్ కోసం వెతుకుతాం. కానీ మనసు అలసిపోయినప్పుడు, ఒంటరితనం ఆవహించినప్పుడు, బాధలు చుట్టుముట్టినప్పుడు మనకు ధైర్యం చెప్పే మనుషుల కోసం ఎంత సమయం కేటాయిస్తున్నాం? అనే ప్రశ్న ప్రతి ఒక్కరూ తమను తాము వేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒక చిన్న పలకరింపు, ఆప్యాయంగా పలికే మాట, కష్టాల్లో ఉన్నవారికి అందించే చేయూత, కుటుంబ సభ్యులతో గడిపే కొంత సమయం.. ఇవే మనసుకు నిజమైన చార్జింగ్. డబ్బు, హోదా, సాంకేతిక సౌకర్యాలు ఎన్ని ఉన్నా ఆత్మీయతను కొనలేం. మనుషుల మధ్య నమ్మకం, ప్రేమ, పరస్పర గౌరవం ఉన్నప్పుడే జీవితానికి అసలైన సంతోషం లభిస్తుంది.

### ప్రకృతికి దూరమైతే.. మనుగడకే ముప్పు!

మానవ సంబంధాలే కాదు.. ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధం కూడా క్రమంగా బలహీనపడుతోంది. చెట్లు, పచ్చని పొలాలు, స్వచ్ఛమైన గాలి, నీరు, పక్షుల కిలకిలరావాలు మనిషి జీవితంలో అంతర్భాగాలు. కానీ అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. చెట్లు తగ్గిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం, కాలుష్యం పెరగడం వంటి పరిణామాలు మానవ మనుగడపై ప్రభావం చూపుతాయి.

సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ అయితే మళ్లీ చార్జింగ్ చేసి పనిచేయించుకోవచ్చు. కానీ ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే, నీరు మరియు స్వచ్ఛమైన గాలి కొరత ఏర్పడితే, జీవవైవిధ్యం నశిస్తే వాటిని తిరిగి పూర్వస్థితికి తీసుకురావడం అంత సులభం కాదు. అందుకే ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి. మొక్కలు నాటడం, నీటిని పొదుపు చేయడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి చిన్నచిన్న చర్యలే భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయి.

### మార్పు మన నుంచే ప్రారంభం కావాలి...

సాంకేతికతను పూర్తిగా దూరం పెట్టడం పరిష్కారం కాదు. దానిని అవసరానికి తగిన విధంగా వినియోగించుకోవడమే అసలైన విజ్ఞత. కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయంలో ఫోన్లను పక్కన పెట్టడం, పిల్లలకు సమయం కేటాయించడం, వృద్ధుల అనుభవాలను వినడం, స్నేహితులను ప్రత్యక్షంగా కలవడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా మానవ సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవచ్చు.రోజులో కొంత సమయాన్ని ప్రకృతితో గడపడం, మొక్కలను పెంచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అలవాటు చేసుకోవాలి. మనిషికి మనిషే తోడుగా నిలిచే సమాజాన్ని నిర్మించాలంటే ప్రేమ, అనురాగం, మానవత్వం అనే విలువలను కాపాడుకోవాలి.